వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 04 | సంచిక : 271
పేజీలు : 08 | వెల: రూ.5/-
శుక్రవారం
ఆగస్టు 01, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net



## మార్త భద్రయ్య మృతికి సంతాపం

నిమ్స్ హాస్పటల్ లైజనింగ్ ఆఫీసర్ డాక్టర్ మార్త రమేష్ తండ్రి మార్త భద్రయ్య అనారోగ్య కారణాలతో శుక్రవారం మృతి చెందారు. స్థానికంగా మంచి పలుకుబడి కలిగిన భద్రయ్య మృతికి పలువురు సంతాపం ప్రకటించారు. మార్త భద్రయ్య ఆత్మ సద్గతిప్రాప్తించాలని తెలంగాణ పద్మశాలి సంఘం అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షులు దుస్స శివశంకర్ కోరారు. – వరంగల్ వాయిస్, వరంగల్

వివరాలు2లో..

# 'గెస్ట్'కే ఎసరు !

## అతిథి అధ్యాపకుల అరిగోస






- ఆరు నెలలుగా అందని వేతనాలు
- ఉద్యోగ భద్రత లేక బజారున పడ్డ గెస్ట్ లెక్చరర్లు
- పదేళ్ల శ్రమకు ఫలితం శూన్యం
- ప్రభుత్వం ఆదుకోవాలంటూ విన్నపం

రాష్ట్ర వ్యాప్తంగా గత పది సంవత్సరాలుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పని చేస్తున్న గెస్ట్ లెక్చరర్లకు ఎసరు పెడుతున్నారు. నిబంధనల మేరకే 1,654 మంది అతిథి అధ్యాపకుల నియామకం జరిగినప్పటికీ రెగ్యూలర్ అధ్యాపకులు వచ్చారన్న సాకుతో ఒక్కొక్కరికీ ఉద్వాసన పలుకుతున్నారు. గత పది సంవత్సరాల పాటు రెగ్యూలర్ లెక్చరర్లకు ఏమాత్రం తీసిపోని విధంగా సేవలు అందించినప్పటికీ కనికరం లేని ప్రభుత్వం కాదు పొమ్మంటోంది. ఒకవైపు చేసిన పనికి వేతనం లేక.. మరోవైపు 2025-26 విద్యాసంవత్సరానికి కొంతమంది ఉద్యోగాలు రెన్యూవల్ కాక గెస్ట్ లెక్చరర్లు అరిగోస పడుతున్నారు. గత విద్యా సంవత్సరంలో డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి,మార్చి నెలలతోపాటు ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రారంభమై ఆగస్టు నెల వచ్చినా ప్రభుత్వం ఇప్పటివరకు జీతాలు చెల్లించకపోవడంతో అప్పచేసి కుటుంబ అవసరాలు తీర్చుకుంటున్నారు. గెస్ట్ ఫ్యాకల్టీలు ఉన్న ఫలంగా ఉద్యోగాలు కోల్పోవడంతో వారి కుటుంబాలు ఒక్కసారిగా రోడ్డుపాలయ్యాయి. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు అతిథి అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు, ప్రతి నెల రూ.42 వేల వేతనాన్ని చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. మానవతా దృక్పథంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అతిథి అధ్యాపకులకు అండగా నిలవాలని కోరుతున్నారు. - వరంగల్ వాయిస్, దామెర



2లో..

## ప్రతీ ఎకరాకు సాగునీరు అందిస్తాం

- గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క
- లక్నవరం పంట కాలువలకు నీటి విడుదల



8లో..

## ఓరుగల్లులో క్రికెట్ స్టేడియం

- అనువైన స్థలంకోసం ప్రతిపాదనలు
- కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ కు ఆదేశాలు
- ఈ నెలలోనే స్పోర్ట్స్ స్కూల్ కం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రారంభం



8లో..

## భూపాలపల్లికి బైపాస్ రోడ్డు

- ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ




2లో..

## జర్నలిస్టుపై పెట్టిన అక్రమ కేసు ఎత్తివేయాలి

- ప్రభుత్వానికి టీడబ్ల్యూజేఎఫ్ డిమాండ్
- కలెక్టర్ కు జర్నలిస్టు నేతల వినతి

# 'గెస్ట్'కే ఎసరు..!



- అతిథి అధ్యాపకుల అరిగోస
- ఆరు నెలలుగా అందని వేతనాలు
- ఉద్యోగ భద్రత లేక బజారున పడ్డ గెస్ట్ లెక్చరర్లు
- పదేళ్ల శ్రమకు ఫలితం శూన్యం
- ప్రభుత్వం ఆదుకోవాలంటూ విన్నపం

**వరంగల్ వాయిస్, దామెర :** ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు గత పది సంవత్సరాలుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు, ప్రతి నెల రూ.42 వేల వేతనాన్ని చెల్లించాలని గెస్ట్ లెక్చరర్లు కోరుతున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమ బాధను అర్థం చేసుకోవాలంటున్నారు. ఉద్యోగ భద్రత కల్పించి రోడ్డునపడుతున్న తమ కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గత పది సంవత్సరాలుగా పనిచేస్తున్న 1,654 మంది అతిథి అధ్యాపకులకు గత ఆరు నెలల వేతనాలు రాక, నేడు ఉద్యోగ భద్రత లేక అరిగోస పడుతున్నారు.

### నిబంధనల మేరకే నియామకాలు..

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న జూనియర్ లెక్చరర్స్ పోస్టులకు గతంలో ఉన్న కాంట్రాక్టు, పార్ట్ టైం రిక్రూట్ మెంట్ సిస్టంలకు స్వస్తి పలికి, గెస్ట్ (అతిథి) సిస్టంలో అధ్యాపకుల రిక్రూట్ మెంట్ కు నోటిఫికేషన్ జారీ చేసింది. త్రిమెన్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో డెమోలు, ఇంటర్వ్యూలు నిర్వహించి, మెరిట్ ఆధారంగా నిబంధనల మేరకే రాష్ట్ర వ్యాప్తంగా 1,654 మందిని ఎంపిక చేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో రెగ్యులర్, కాంట్రాక్ట్ అధ్యాపకులతో సమానంగా విధులు నిర్వహించారు. వేసవికాలంలో వీరికి జీతం లేకున్నా, అడ్మిషన్ల కోసం కృషి చేస్తూ, ప్రభుత్వ జూనియర్ కళాశాలల బలోపేతానికి పాటుపడ్డారు. నిరుపేద విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేస్తున్న అతిథి అధ్యాపకుల పరిస్థితి నేడు అగమ్య గోచరంగా మారింది.

### ఏడు నెలల జీతమే..

ప్రతి ఏడు జూన్ మాసంలోనే జూనియర్ కాలేజీలు ప్రారంభం అవుతున్నా గెస్ట్ ఫ్యాకల్టీని మాత్రం ఆటో రెన్యూవల్ చేయకుండా ఇష్టారీతిగా వ్యవహరించడంతో విద్యా సంవత్సరంలో కేవలం ఏడు నెలలు మాత్రమే జీతం లభిస్తోందని అతిథి అధ్యాపకులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక సంవత్సరం జూలైలో, మరో సంవత్సరం ఆగస్టులో అధికారులు ఇష్టం వచ్చినట్లు విధుల్లోకి తీసుకొని, నెలంతా పనిచేసినా పీరియడ్ ల విధానం ప్రకారం ఒక్కో పీరియడ్ కు రూ.390 చొప్పున, నెలకు 72 పీరియడ్ లకు రూ.28,080 వేతనాన్ని చెల్లిస్తున్నారు. అది కూడా ప్రతి నెల కాకుండా మూడు, నాలుగు నెలలకు ఒకసారి చెల్లించడంతో ఆర్థిక ఇబ్బందులు తప్పడంలేదంటున్నారు.

### ఆరు నెలలుగా వేతనాలు బంద్..

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో రెగ్యులర్, కాంట్రాక్ట్ అధ్యాపకులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ గత విద్యా సంవత్సరంలో నాలుగు నెలలు, ప్రస్తుత విద్యా సంవత్సరంలో రెండు నెలలు, మొత్తం ఆరు నెలలుగా వేతనాలు రాక, కుటుంబ పోషణ భారమై, అప్పుల పాలై, ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతున్నట్లు అతిథి అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో పనిచేసే ఉద్యోగులకు పండగ సెలవులు వస్తే సంబరం, కాని అతిథి అధ్యాపకులకు, వీరి కుటుంబాలకు మాత్రం ఉపవాసం తప్పడంలేదంటున్నారు.

### ఉద్యోగ భద్రత కరువు..

ప్రతి విద్యా సంవత్సరం ప్రభుత్వం వీరికి ఆటో రెన్యువల్ చేయక పోవడమే కాక, ఎలాంటి ఉద్యోగ భద్రత కల్పించడం లేదు. రెగ్యులర్, కాంట్రాక్ట్ అధ్యాపకుల బదిలీలు, ఆన్ డ్యూటీల (ఓడీ) ప్రక్రియ చేపట్టినప్పుడల్లా గెస్ట్ అధ్యాపకులు డిస్టర్బ్ కావాల్సివస్తోంది. వీరు పని చేసే స్థానాలకే బదిలీలు, ఆన్ డ్యూటీలు చేపట్టడం జరుగుతుంది. విద్యా సంవత్సరం మధ్యలో బదిలీలు, ఆన్ డ్యూటీల (ఓడి) తో ఉద్యోగాలు పోయి, మధ్యలో వేరే ఉద్యోగం దొరక్క అనేక ఇబ్బందులకు గురికావాల్సిన పరిస్థితి నెలకొంది. దీనికితోడు ఇటీవలి కాలంలో అతిథి అధ్యాపకులు పనిచేసే స్థానాల్లో, ప్రభుత్వం టీఎస్ పీఎస్సీ ద్వారా 1,292 నూతన జూనియర్ లెక్చరర్స్ నియామకాలు చేపట్టింది. వీటితోపాటు ప్రస్తుతం ఇంటర్ బోర్డ్ అధికారులు చేపడుతున్న ఆన్ డ్యూటీ (ఓడీ) బదిలీలతో మరికొంతమంది అతిథి ఆధ్యాపకులను ఉన్న ఫలంగా ఉద్యోగాలనుంచి తొలగించి, బజారున పడేసింది. గెస్ట్ ఫ్యాకల్టీలు ఉన్న ఫలంగా ఉద్యోగాలు కోల్పోయి, పదేళ్ల శ్రమ వృథా అవ్వడమే కాకుండా, ఇప్పటికిప్పుడు వేరే ఉద్యోగం దొరకక, కుటుంబ పోషణ కోసం అప్పులు చేసి, ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతున్నారు.

### ఉద్యోగ భద్రత కల్పించాలి

**- బత్తిని సునీల్ కుమార్, అతిథి అధ్యాపకుల సంఘం జిల్లా నాయకులు**



గత కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్న అతిథి అధ్యాపకులను ఉన్న ఫలంగా ఉద్యోగాల నుంచి తీసివేయకుండా, ప్రజా ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు తమకు ఉద్యోగ భద్రత కల్పించి, పెండింగ్ లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలి. గెస్ట్ ఫ్యాకల్టీకి సీఎం రేవంత్ రెడ్డి అండగా నిలవాలి.

### పెండింగ్ వేతనాలను చెల్లించాలి

**- పెద్దపెల్లి తిరుపతి, అతిథి అధ్యాపకుల సంఘం రాష్ట్ర నాయకులు**



గత ఆరు నెలలుగా పెండింగ్ లో ఉన్న వేతనాలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలి. ఈ విద్యా సంవత్సరం తమను విధుల్లోకి తీసుకోవడానికి జీవోను విడుదల చేసి, తమకు ఉద్యోగ భద్రత కల్పించాలి. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డిని, ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

# జర్నలిస్టుపై పెట్టిన అక్రమ కేసు ఎత్తివేయాలి

- ప్రభుత్వానికి టీడబ్ల్యూజేఎఫ్ డిమాండ్
- కలెక్టర్ కు జర్నలిస్టు నేతల వినతి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ జిల్లాలో ఇటీవల సీనియర్ జర్నలిస్టు దామెర రాజేందర్ పై ఐనవోలు పోలీసులు పెట్టిన తప్పుడు కేసును వెంటనే ఎత్తివేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర నాయకులు డిమాండ్ చేశారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ఉపాధ్యక్షులు పులిపలుపుల ఆనందం, వల్లాల జగన్, బండి విజయ్ కుమార్, కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, జాతీయ కౌన్సిల్ సభ్యుడు కుడుతాడి బాపురావు, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు టీవీ రాజు, వరంగల్ జిల్లా అధ్యక్షుడు జక్కుల విజయ్ కుమార్ తదితరులు గురువారం హనుమకొండ జిల్లా కలెక్టర్ ను కలిసి వినతి పత్రం సమర్పించారు. జర్నలిస్ట్ దామెర రాజేందర్ పై ఐనవోలు పోలీసులు బనాయించిన తప్పుడు కేసు వివరాలను వారు కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ రాజేందర్ గతంలో దాదాపు పదేండ్లు వివిధ పత్రికల్లో రిపోర్టర్ గా పనిచేశారని, ప్రస్తుతం సొంత పత్రికను నడుపుతున్నారన్నారు. ఐనవోలు తహశీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న అక్రమాలపై రాజేందర్ పత్రికలో వరుస కథనాలు ప్రచురించారని తెలిపారు. దీనిని మనసులో పెట్టుకున్న ఐనవోలు తహశీల్దార్ రాజేందర్ పై కుట్రపన్ని పథకం ప్రకారం ఓ యూట్యూబర్ సహాయంతో పోలీసులతో కుమ్మక్కై కావాలని తప్పుడు కేసు నమోదు చేయించి జైలుకు పంపించారని ఆరోపించారు. నీతి, నిజాయితీతో వార్తలు రాస్తున్న జర్నలిస్టులపై ఇలాంటి తప్పుడు కేసులు పెట్టడం సరైంది కాదని అన్నారు. కావాలని ఒకరిద్దరు రాజేందర్ పై సోషల్ మీడియా వేదికగా అసత్యాలు ప్రచారం చేస్తున్నారని, తప్పుడు ప్రచారాలు చేస్తున్న యూట్యూబర్ ను వదిలేసి ఏ తప్పు చేయని జర్నలిస్టు రాజేందర్ పై పోలీసులు అక్రమంగా కేసు బనాయించి వేధిస్తున్నారని ఆరోపించారు. ఈ కుట్రపూరిత అక్రమ కేసు వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. జర్నలిస్టు రాజేందర్ పై పోలీసులు పెట్టిన కేసును ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఐనవోలు తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన భూములు, ప్లాట్ల అక్రమ రిజిస్ట్రేషన్ లపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. జర్నలిస్టులపై పోలీసులు పెట్టిన అక్రమ కేసులకు బాధ్యులైన ఐనవోలు తహశీల్దార్, ఎస్ఐలను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం, ఉన్నతాధికారులు వెంటనే స్పందించి జర్నలిస్టు దామెర రాజేందర్ పై అక్రమ కేసు తొలగించక పోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేయాల్సి వస్తుందని మామిడి సోమయ్య హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పోలమాని గోపాల్, పాలడుగుల సురేందర్, సభ్యులు శంకర్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రతీ ఎకరాకు సాగునీరు అందిస్తాం

- గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క
- లక్నవరం పంట కాలువలకు నీటి విడుదల

**వరంగల్ వాయిస్, ములుగు :** గోవిందరావుపేట లక్నవరం వద్ద పంట కాలువలకు రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క శుక్రవారం నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గత కొంతకాలంగా రైతులు నాట్లు వేసుకోవడానికి నీటి కొరత ఉన్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. అయితే లక్నవరం సరస్సు తూముల మరమ్మతు కారణంగా నీటిని శుక్రవారం విడుదల చేశామన్నారు. లక్నవరం సరస్సులో మొత్తం 33 ఫీట్లు ఎత్తుకు నీరు చేరుకోవాల్సి ఉండగా ప్రస్తుతం 28 ఫీట్ల నీటి మట్టం కలిగి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి తో పాటు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, బ్లాక్, మండల, గ్రామ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### మృతుల కుటుంబాలకు పరామర్శ..

ములుగు మండలం జాకారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ వార్డు సభ్యుడు మహమ్మద్ జానీ పాషా తండ్రి అబ్జల్ ఇటీవల మరణించగా వారి కుటుంబాన్ని సీతక్క పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. వారి కుటుంబానికి అండగా ఉంటామంటూ హామీ ఇచ్చారు. ఇదే గ్రామానికి చెందిన తిప్పారపు దేవరాజ్ ఇటీవల మరణించగా వారి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
శుక్రవారం, ఆగస్టు 01, 2025

# ఫిరాయింపు ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలి

## ■ ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు



**వరంగల్ వాయిస్, బాలసముద్రం :** ఫిరాయింపు ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలని, లేదంటే వారిపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ పార్టీ శాసనమండలి సభ్యులు తక్కెళ్లపల్లి రవీందర్ రావు కాంగ్రెస్ పార్టీని డిమాండ్ చేశారు. హనుమకొండ జిల్లాలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపకుడు రాజీవ్ గాంధీ తీసుకొచ్చిన ఫిరాయింపుల నిరోధక చట్టంపై, రాజ్యాంగంపై కాంగ్రెస్ పార్టీకి గౌరవం ఉంటే వెంటనే చర్యలు తీసుకోవాలని రవీందర్ రావు అన్నారు. 2023 నవంబర్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గుర్తుపై గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి మారిన 10 మంది ఎమ్మెల్యేలపై సుప్రీంకోర్టు ఇటీవల కీలక తీర్పు ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు. ఈ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు కేపీ వివేకానందగౌడ్, పాడి కౌశిక్‌రెడ్డి, అలాగే వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారని తెలిపారు. ఈ పిటిషన్లపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు, ఈ ఫిరాయింపు ఎమ్మెల్యేల అంశంపై మూడు నెలల్లోగా (2025 అక్టోబర్ 31 లోపు) నిర్ణయం తీసుకోవాలని తెలంగాణ శాసనసభ స్పీకర్‌ను ఆదేశించిందని ఆయన వెల్లడించారు. ఫిరాయింపు పిటిషన్లను స్పీకర్ ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంచడం సరికాదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని అత్యున్నత ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ విషయంలో హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు కొట్టివేసిందని రవీందర్ రావు చెప్పారు. గతంలో బీఆర్ఎస్ నాయకులు వేసిన అనర్హత పిటిషన్లపై విచారణ జరిపిన హైకోర్టు సింగిల్ బెంచ్, నాలుగు వారాల్లోగా విచారణ షెడ్యూల్ ఇచ్చి నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. అయితే, ఈ తీర్పును రద్దు చేయాలని కోరుతూ అసెంబ్లీ సెక్రటరీ హైకోర్టు డివిజన్ బెంచ్‌లో అప్పీల్ పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌ను విచారించిన డివిజన్ బెంచ్, అనర్హత విషయంలో స్పీకర్‌కు టైమ్ బాండ్ లేదని పేర్కొంటూ సింగిల్ బెంచ్ తీర్పును కొట్టివేసింది. దీంతో కేటీఆర్, కౌశిక్‌రెడ్డి, వివేకానందగౌడ్ సుప్రీంకోర్టులో పిటిషన్లు వేయగా, సుప్రీంకోర్టు ఈ చారిత్రక తీర్పు వెలువరించిందని ఆయన వివరించారు. భవిష్యత్తులో ఇలాంటి ఫిరాయింపులను నిరోధించడానికి పార్లమెంటు ప్రత్యేక చట్టం తీసుకురావాలని కూడా సుప్రీంకోర్టు అభిప్రాయపడిందని రవీందర్ రావు తెలిపారు. తెలంగాణ పాలన ఢిల్లీలో కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ చేతుల్లో ఉందని, సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ కాంగ్రెస్ రిమోట్ కంట్రోల్‌కు కీలుబొమ్మగా మారారని రవీందర్ రావు విమర్శించారు. కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, నాయకులు జనార్దన్ గౌడ్, పులి రజినీకాంత్, రవీందర్ రావు, నాయీముద్దీన్, రజినీకుమార్, రామ్మూర్తి, వీరేందర్, బుద్దె వెంకన్న, మూటిక రాజు, రమేష్, శ్రీకాంత్ చారి, మహేందర్, సతీష్, దేవమ్మ, గౌస్ ఖాన్, జేకే పాల్గొన్నారు

# మృతుల కుటుంబాలకు పరామర్శ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 65వ డివిజన్ పరిధిలోని దేవన్నపేట గ్రామంలో ఇటీవల మరణించిన వారి కుటుంబాలను వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పరామర్శించారు. గ్రామానికి చెందిన పోలేపల్లి యాదమ్మ అనారోగ్యంతో మరణించగా ఎమ్మెల్యే నాగరాజు ఆమె నివాసానికి వెళ్లి భౌతిక దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఇటీవల అనారోగ్యంతో మరణించిన నందిపాక కుమారస్వామి, నందిపాక రాజమ్మల కుటుంబాలను కూడా ఆయన పరామర్శించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగిలి వెంకట్రాం నరసింహారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు అయ్యాల రాంరెడ్డి, కాంగ్రెస్ నాయకులు మాట్ల విష్ణు యాదవ్, పోలేపాక అశోక్, నందిపాక భాస్కర్, వర్ధన్నపేట నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆవుల పవన్ కళ్యాణ్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ట్రస్మా జిల్లా అధ్యక్షుడికి సన్మానం



**వరంగల్ వాయిస్, మల్హర్:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా ట్రాస్మా (తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్) అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన వీరమనేని సంపత్ రావును మల్హర్ మండల తహసీల్దార్ రవి కుమార్ ఘనంగా సన్మానించారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవి కుమార్ తాడిచర్ల గ్రామానికి చెందిన శ్రీ సాయి వాణి విద్యానికేతన్ కరస్పాండెంట్ అయిన సంపత్ రావును అభినందించారు. ఈ సన్మాన కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌తో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# మహాలక్ష్మి పథకం మహిళలకు వరం

## ● ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల:** పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి శుక్రవారం పరకాల పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద నాలుగు కొత్త ఆర్టీసీ బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా ఒక బస్సు నడిపి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం విజయవంతంగా కొనసాగుతోందని అన్నారు. 2023 డిసెంబర్ 9న ఈ పథకం ప్రారంభమైన నాటి నుంచి మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో మాత్రమే మహిళలకు ఈ ఉచిత బస్సు ప్రయాణం అందుబాటులో ఉందని, త్వరలో ఇతర రాష్ట్రాల్లో కూడా ఇది అమలు కాబోతుందని ఆయన వెల్లడించారు. మహాలక్ష్మి పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 200 కోట్ల టికెట్లపై మహిళలు ఉచితంగా ప్రయాణించగా, దీని ద్వారా ఆర్టీసీకి రూ. 6 వేల కోట్ల లాభం వచ్చిందని ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని, అందులో భాగంగా ఆర్టీసీ బస్సులు, సోలార్ ప్లాంట్లు, క్యాంటీన్లు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, డెయిరీ యూనిట్లు, ఇతర స్వయం ఉపాధి పథకాలతో మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తోందని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరా మహిళాశక్తి పథకంతో మహిళా సంఘాలు బస్సులు కొనుగోలు చేయడం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయని ప్రకాశ్ రెడ్డి చెప్పారు. ప్రజా రవాణా వ్యవస్థను మెరుగుపరచడానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని స్పష్టం చేశారు. త్వరలో పరకాల డిపోకు మరిన్ని బస్సులు రాబోతున్నాయని, ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా కొత్త బస్సులను కొనుగోలు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలకు ఆర్థికంగా వెసులుబాటు లభిస్తుందని ఆయన అన్నారు.

# ప్రతి కాలనీ అభివృద్ధి మా లక్ష్యం

## ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని ప్రతి కాలనీని అభివృద్ధి చేయడమే తమ ధ్యేయమని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం 50వ డివిజన్‌లోని జులైవాడలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన మేయర్ గుండు సుధారాణితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలకు మౌలిక సదుపాయాలైన శుభ్రత, తాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ, సీసీ రోడ్ల వంటి వాటిలో ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాబోయే ఎన్నికల నాటికి అన్ని డివిజన్‌లలో అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు ఆయన వెల్లడించారు. అనంతరం, సుబేదారిలో నూతనంగా నిర్మించిన ఎక్సైజ్ శాఖ విశ్రాంతి భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

# రామాలయానికి విరాళం అందజేత



**వరంగల్ వాయిస్, గణపురం :** మండల కేంద్రంలోని ప్రముఖ శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి ఆలయం అభివృద్ధి కోసం సిరంగి ధనుజ పటేల్, వెంకటేశ్వర పటేల్ దంపతులు రూ.10,116 విరాళాన్ని అందజేశారు. శుక్రవారం శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా ఈ దంపతులు ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు, ఆలయ అర్చకులు ముసునూరి నరేష్ ఆధ్వర్యంలో శ్రీ సీతారామచంద్రస్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. పూజల అనంతరం సిరంగి దంపతులు ఆలయ అభివృద్ధిలో తమ వంతు సహాయంగా ఈ నగదును ఆలయ అధ్యక్షుడు తాళ్లపల్లి గోవర్ధన గౌడ్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బండారు శంకర్, మూల శ్రీనివాస్ గౌడ్, బటిక స్వామి, మాదాసు అర్జున్, బూర రాజగోపాల్, దైవాల భద్రయ్య, మాదాసు మొగిలి, ఉయ్యాల భిక్షపతి, పాండవుల భద్రయ్యలతో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

# దేవాదుల నీటితో చెరువులు నింపండి

## బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మహేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట:** గత పది రోజుల క్రితం ధర్మసాగర్ రిజర్వాయర్ నుంచి దేవాదుల నీటిని కెనాల్స్‌కు విడుదల చేస్తున్నట్లుగా కేవలం ఫోటోలకు ఫోజులిచ్చిన వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, నియోజకవర్గంలోని చెరువులను సందర్శించి వాటిని దేవాదుల నీటితో నింపి రైతులను ఆదుకోవాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కుందూరు మహేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం వర్షాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కొన్ని రోజుల పాటు కురిసిన చినుకులకు ఆశపడి రైతులు వరి నాట్లు వేసుకున్నారని, అయితే ఇప్పుడు అవి ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. భూగర్భ జలాలు కనిష్ట స్థాయికి పడిపోవడంతో బోర్లు, బావుల్లో కూడా నీళ్లు లేవని, ఈ పరిస్థితుల్లో వేల రూపాయలు ఖర్చు పెట్టి వరినాట్లు వేసుకున్న రైతులు తీవ్ర నష్టాలను చవిచూసే ప్రమాదం ఉందని మహేందర్ రెడ్డి అన్నారు. రైతుల పరిస్థితి "మునిగే నక్క మీద తాడిపండు పడ్డట్లు" అగమ్యగోచరంగా మారిందని ఆయన పేర్కొన్నారు. తక్షణమే ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు స్పందించి దేవాదుల నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# పశువుల కొట్టం కూల్చివేత దారుణం

## ◆ మాజీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఆగ్రహం



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి:** మంజూరునగర్‌లో నివాసముంటున్న కూరాకుల ఓదెలు, లలిత దంపతుల పశువుల కొట్టాన్ని అక్రమంగా కూల్చివేయడంపై భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓదెలుకు మద్దతుగా శుక్రవారం ఆయన ఇంటి వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గండ్ర మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో చట్టం లేనట్లు, 'తాను చెప్పిందే చట్టం' అన్నట్లుగా పశువుల కొట్టాన్ని దుర్మార్గంగా కూల్చివేశారని ఆరోపించారు. ఈ చర్య వెనుక పోలీసు, మున్సిపల్ అధికారుల విచ్చలవిడితనం స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. ఎస్పీ కార్యాలయం కూతవేటు దూరంలో ఇలాంటి దారుణం జరుగుతున్నా ఐపీఎస్ అధికారి ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎమ్మెల్యేకు కార్యకర్తగా పనిచేయాలనుకుంటే ఖాకీ దుస్తులు తీసి పని చేయాలని, లేకపోతే సీఐగా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని హితవు పలికారు. మోహినొద్దీన్ అనే వ్యక్తి పాఠశాల కోసం 12 అడుగుల రోడ్డు స్థలం దానం చేస్తే, ప్రైవేట్ భూమిలో రోడ్డు వేయడానికి అధికారులకు ఎవరు అధికారం ఇచ్చారని గండ్ర ప్రశ్నించారు. ఈ అక్రమ రోడ్డు నిర్మాణం వెనుక ఎమ్మెల్యే, పోలీసులు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు వాటాలు ఉన్నాయా అని నిలదీశారు. అమాయకులైన ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం మంచి పద్ధతి కాదని ఆయన హెచ్చరించారు. అన్యాయానికి గురైన ఓదెలు పక్షాన తాము నిలబడతామని, న్యాయం జరిగే వరకు పోరాడతామని స్పష్టం చేశారు. మున్సిపల్ కమిషనర్‌పై గతంలో తానే ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అవినీతి ఆరోపణలు వచ్చాయని, అక్రమంగా డీజిల్ తీసుకోవడం, చేయని పనులకు బిల్లులు పెట్టడం వంటివి జరిగాయని గండ్ర గుర్తు చేశారు. అప్పుడు ఆయన్ను సరెండర్ చేస్తే, ఇప్పుడు మళ్లీ అదే అవినీతి అధికారిని తీసుకొచ్చి ఇక్కడ పెట్టడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఆయన వచ్చిన తర్వాత మున్సిపాలిటీలో అవినీతి తాండవం చేస్తోందని, పారిశుధ్య పనులు సరిగా జరగడం లేదని ఆరోపించారు. ఓదెలుకు జరిగిన అన్యాయానికి బాధ్యుడైన మున్సిపల్ కమిషనర్‌ను సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీసీ బిల్లు కోసం కవిత దీక్ష

## కేయూలో పోస్టర్ల ఆవిష్కరణ




**వరంగల్ వాయిస్, కేయూ:** పార్లమెంట్‌లో బీసీ బిల్లును ప్రవేశపెట్టి 42 శాతం రిజర్వేషన్లు ఆమోదించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేపట్టిన 72 గంటల నిరాహార దీక్షకు మద్దతుగా కాకతీయ యూనివర్సిటీలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం కేయూ మొదటి గేటు వద్ద డాక్టర్ పర్లపల్లి శ్రీశైలం సమక్షంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ జాగృతి రాష్ట్ర సీనియర్ నాయకులు డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్ గోడ పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ బిల్లు విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ద్వంద్వ వైఖరిని తీవ్రంగా విమర్శించారు. బీసీ బిల్లు కవిత ద్వారానే సాధ్యపడుతుందని, అందుకోసం ఉద్యమిస్తున్న ఆమె నిరాహార దీక్షకు అన్ని బీసీ కులాలు మద్దతు ఇవ్వాలని కోరారు. యూనివర్సిటీ విద్యార్థులు శ్రవణ్, శ్రీధర్, రాకేష్, అనిల్, జన్ను సంతోష్, ఉదయ్, భరత్, సుతేజ్, తాండ్ర భాస్కర్, కుసుమ రాజు, గణిపాక చరణ్, మధు, వాంచనగిరి పాల్గొన్నారు.


# మహా గర్జన సభను విజయవంతం చేయాలి

## ఎమ్మార్పీఎస్ నాయకుల పిలుపు



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు:** ఆగస్టు 13న హైదరాబాద్‌లో జరగనున్న వికలాంగుల, పెన్షన్ దారుల మహా గర్జన సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నద్దునూరి రఘు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆత్మకూరు మండలం పెంచికలపేట గ్రామంలో వికలాంగులు, పెన్షన్ దారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త కమిటీని ఎన్నుకున్నారు. రఘు మాట్లాడుతూ ఈనెల 7వ తేదీన హనుమకొండలోని ఎన్టీఆర్ గార్డెన్‌లో జరిగే సన్నాహక సమావేశానికి అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా వస్తారని తెలిపారు. వికలాంగులకు నెలకు రూ.6 వేలు, ఆసరా పెన్షన్ దారులకు రూ.4 వేలు, కండరాల క్షీణత ఉన్నవారికి రూ.15 వేలు పెన్షన్ చెల్లించాలని రఘు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు అధికారంలోకి రాగానే పెన్షన్లు పెంచుతామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చి ఇప్పుడు మాట తప్పారని ఆయన విమర్శించారు. ఈ సందర్భంగా వికలాంగుల కమిటీ అధ్యక్షుడిగా జిల్లేపల్లి శేఖరయ్య, ప్రధాన కార్యదర్శిగా మందపల్లి సుధాకర్, ఉపాధ్యక్షుడిగా మందమల్లయ్య, కార్యదర్శిగా మధుగిరి రూప, కోశాధికారిగా పొలం రాజగోపాల్ రెడ్డి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో కొలగాని మల్లయ్య, చిలువేరు ప్రవీణ్, హర్షం సుధాకర్, మందపల్లి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# అథ్లెటిక్స్‌లో సందీప్ రాష్ట్ర స్థాయికి ఎంపిక



**వరంగల్ వాయిస్, పర్వతగిరి:** మండల పరిధిలోని కల్లెడ ఆర్డీఎఫ్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థి గుగులోత్ సందీప్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడు. జిల్లా స్థాయిలో జరిగిన అండర్-18 అథ్లెటిక్స్ పోటీల్లో 100 మీటర్ల పరుగులో, లాంగ్ జంప్‌లో సందీప్ మొదటి స్థానంలో నిలిచాడు. ఆగస్టు 3, 4 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో సందీప్ పాల్గొంటాడు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. శ్రీనివాస్, ఇంఛార్జి ఏ.సంతోష్, జి. రమేష్, ఏఓ ఎస్. రాజు, పీఈటీలు వేణు, రవితేజ, ఇతర ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు సందీప్‌ను అభినందించారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన వన్నాల శ్రీరాములు

**వరంగల్ వాయిస్, హైదరాబాద్:** అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ గుడ్ల రమాదేవి-వెంకటేశ్వర బాబు దంపతుల కుమార్తె డాక్టర్ సుష్మిత, డాక్టర్ హరి గోవింద్‌ల వివాహం కొంపల్లిలోని పీఎస్ఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, ఉమ్మడి వరంగల్ జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ సాంబారి సమ్మారావు, ప్రముఖ బిల్డర్ దేవునూరి అంజయ్య, తెలంగాణ ఆన్‌లైన్ మీడియా వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి, డీంభాయ్ టీవీ సీఈవో వేముల సదానందం హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించి, వారికి సంతోషకరమైన వివాహ జీవితం గడపాలని ఆకాంక్షించారు.



# భద్రకాళిని దర్శించుకున్న నాయిని



**వరంగల్ వాయిస్, వరంగల్ :** పవిత్ర శ్రావణమాసం సందర్భంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శుక్రవారం శ్రీ భద్రకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మంత్రోచ్ఛరణలతో ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ భద్రకాళి అమ్మవారు ఈ ప్రాంత ప్రజల నమ్మకం అని అన్నారు. అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడటమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి ఇప్పటికే ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామని, దీనిలో భాగంగా ప్రభుత్వం భద్రకాళి ఆలయంలో ప్రత్యేక రోజులలో సుమారు 500 మంది భక్తులకు అన్నదానం చేయాలని జీవో విడుదల చేసిందని తెలిపారు. ప్రతిరోజు వేలాదిగా తరలివచ్చే భక్తులకు ప్రశాంత వాతావరణం కల్పించడానికి నిరంతరం కృషి చేస్తున్నామని ఆయన చెప్పారు. నూతనంగా ఏర్పడిన పాలకవర్గం భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి

## ▪ జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**వరంగల్ వాయిస్, గణపురం :** మండలంలో ఇందిరమ్మ ఇళ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, ఆరోగ్య కేంద్రాల పనితీరును కలెక్టర్ రాహుల్ శర్మ శుక్రవారం పరిశీలించారు. ఎస్సీ కాలనీ, బుర్రకాయలగూడెంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఆయన స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి, నిర్మాణ పనులలో జాప్యం జరగకుండా చూడాలని సూచించారు. నాణ్యతతో కూడిన పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇసుక సరఫరాలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని గృహ నిర్మాణ శాఖ పీడీని కోరారు. అలాగే, లబ్ధిదారులకు నిర్మాణ పద్ధతులపై అవగాహన కల్పించాలని, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సంబంధిత శాఖలకు సూచించారు. ప్రాథమిక పశు వైద్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్, వైద్య సేవల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. పశువులకు టీకాలు వేయాలని, మందుల నిల్వలు ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఒక రైతు తన గొర్రె పిల్లను కలెక్టర్‌కు బహుకరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కూడా సందర్శించిన కలెక్టర్, వైద్యుల సూచనల మేరకు క్రమం తప్పకుండా మందులు వాడాలని ప్రజలకు సూచించారు. తేలు కుట్టి వైద్యం కోసం వచ్చిన లక్ష్మి అనే మహిళను పలకరించి, ఆమెకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు తెలిపారు. రోగులకు హెల్త్ ప్రొఫైల్ తయారు చేయాలని, ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అనంతరం ప్రాథమిక సహకార సంఘం ఎరువుల విక్రయ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, జిల్లాలో ఎరువుల కొరత లేదని, రైతులు అవసరం మేర తీసుకోవచ్చని తెలిపారు. భూ భారతి దరఖాస్తులను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పరిష్కరించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన వృద్ధుడి సమస్యను అడిగి తెలుసుకుని, దాని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, గృహ నిర్మాణ శాఖ పీడీ లోకిలాల్, జిల్లా వ్యవసాయ అధికారి బాబూరావు, తహసీల్దార్ సత్యనారాయణ స్వామి, ఎంపీడీఓ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# 42 శాతం బీసీ రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నాం

- ఎమ్మెల్యేలు నాయిని, కడియం, నాగరాజు
- జాతీయ ఓబీసీ మహాసభ పోస్టర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** ఈ నెల 7న గోవాలో జరగనున్న జాతీయ ఓబీసీ మహాసభల వాల్ పోస్టర్‌ను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.నాగరాజు, మేయర్ గుండు సుధారాణి శుక్రవారం ఆవిష్కరించారు. హనుమకొండ జేఎన్ఎస్ గ్రౌండ్‌లో బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ బీసీలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల కోటాలో 42శాతం రిజర్వేషన్లు కల్పించడానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని తెలిపారు. రాహుల్ గాంధీ చేపట్టిన జోడో యాత్రలో భాగంగా ఎన్నికల ముందు ఇచ్చిన బీసీ డిక్లరేషన్ హామీని అమలు చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ల బిల్లును ప్రవేశపెట్టి ఆమోదింపజేసి గవర్నర్ ద్వారా రాష్ట్రపతికి పంపించారని అన్నారు. అయితే, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆ బిల్లును తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చి బీసీలకు 42శాతం రిజర్వేషన్లు వర్తించేలా కృషి చేయాల్సింది పోయి, రిజర్వేషన్లు దక్కకుండా వెన్నుపోటు పొడవడం దారుణమని ఆయన విమర్శించారు. బీసీలు చేసే ఉద్యమాలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, కేంద్రం మెడలు వంచైనా 42శాతం రిజర్వేషన్లు సాధించే వరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాడి మల్లయ్య యాదవ్, రాష్ట్ర కార్యదర్శి భీమగాని యాదగిరి గౌడ్, హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు కాసగాని అశోక్, బీసీ మహిళా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తమ్మేలా శోభరాణి, బీసీ సంఘం జిల్లా నాయకులు వేముల మహేందర్, పంజల మధు, తంగళ్లపెల్లి అరుణ, మానస తదితరులు పాల్గొన్నారు.

# దందాల కోసమే కాంగ్రెస్‌లోకి నేతలు

## రెడ్యా నాయక్‌పై నిందలు మోపడం తగదు



**వరంగల్ వాయిస్, డోర్నకల్:** పట్టణంలో అక్రమ వ్యాపారాలు చేస్తున్న వ్యక్తులు మాజీ ఎమ్మెల్యే రెడ్యా నాయక్‌పై నిందలు వేయడం ప్రజలు గమనిస్తున్నారని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు విద్యాసాగర్ అన్నారు. శుక్రవారం ఆయన ఈ మేరకు ఘాటైన వ్యాఖ్యలు చేశారు. విద్యాసాగర్ మాట్లాడుతూ పట్టణంలో కొందరు వ్యక్తులు బెల్లం, బియ్యం, గుట్కా, గ్యాస్ వంటి అక్రమ దందాలు చేస్తూ కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారని ఆరోపించారు. వీరు అధికారంలోకి వచ్చిన నాయకులతో సత్సంబంధాలు కొనసాగిస్తూ, ఇప్పుడు తమ వ్యాపారాలను కాపాడుకోవడం కోసం అధికార పార్టీ కాంగ్రెస్‌లో చేరారని విమర్శించారు. రెడ్యా నాయక్ పట్టణ అభివృద్ధి చేయలేదని ఊదరగొట్టిన కాంగ్రెస్ నాయకులు, గడిచిన 18 నెలల్లో చేసిన అభివృద్ధిని ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను అధికారులు ఎందుకు పట్టుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. రెడ్యా నాయక్‌పై లేనిపోని ఆరోపణలు చేస్తే వారి ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు భిక్షం రెడ్డి, యశోధర్, చంటి, శరత్, జనార్దన్, మధు, కాడెం ప్రశాంత్, కుమార్, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ 'ప్రశిక్షణ్ అభియాన్' విజయవంతం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్‌లోని వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజులపాటు జరిగిన బీజేపీ ప్రశిక్షణ్ అభియాన్ కార్యక్రమం ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి హాజరైన ముఖ్య అతిథులకు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వన్నాల వెంకట రమణ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు, మురళీధర్ రావు, ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) చంద్రశేఖర్ జీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం డాక్టర్ వన్నాల వెంకట రమణ వారిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సిద్ధాంతాలను, సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సంతోష్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు మల్లాది తిరుపతి రెడ్డి, భాకం హరిశంకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, జిల్లా ఉపాధ్యక్షుడు రంజిత్, రాష్ట్ర పదాధికారులు, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికులకు అండగా ఉంటాం

- ఏఐసీటీయూ నాయకులు



**వరంగల్ వాయిస్, వరంగల్:** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల వల్ల భవన నిర్మాణ కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని ఏఐసీటీయూ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. వరంగల్‌లోని ఎంసీపీఐయూ పార్టీ కార్యాలయంలో జరిగిన బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్లీనరీలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ఏఐసీటీయూ జాతీయ నాయకులు నర్ర ప్రతాప్, జిల్లా కార్యదర్శి సుంచు జగదీశ్వర్, జిల్లా నాయకులు మాలోత్సాగర్, ముక్కెర రామస్వామి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడం ద్వారా భవన నిర్మాణ కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందని విమర్శించారు. బిల్డింగ్ కార్మికులకు కనీస పెన్షన్ రూ. 9,000 అమలు చేయాలి. కార్మికుల సంక్షేమం కోసం వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని నియమించాలి. పనిచేసే చోట ప్రమాదవశాత్తు చనిపోయినా, గాయపడినా ఇంటి యజమాని, ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.ఇసుక, ఇతర నిర్మాణ సామగ్రి ధరలు పెరగడం, ఆధునిక యంత్రాలు అందుబాటులోకి రావడం వల్ల కార్మికులు పని కోల్పోతున్నారు. కార్మికుల పని దినాలను 8 గంటల నుండి 10–12 గంటలకు పెంచే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రతి భవన నిర్మాణ కార్మికునికి ఖాళీ స్థలం కేటాయించి, ఇందిరమ్మ ఇళ్లు కట్టివ్వాలి. లేబర్ ఆఫీసులో పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించాలి. అడ్డాల వద్ద హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసి కార్మికుల ఆరోగ్య సమస్యలను పరిష్కరించాలి. ఈ సందర్భంగా బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ వరంగల్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎండి. అక్బర్ ఖాన్, కార్యదర్శిగా డి. రాజు, కోశాధికారిగా కె. సప్న ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఎం. సాగర్, పెద్దిరాజు, గణిపాక ఓదెలు, సహాయ కార్యదర్శులుగా రవీందర్, యాకయ్య, రఘుపతి, సంపత్, డి. రాజుతో కలిపి మొత్తం 22 మందితో ఈ కమిటీ ఏర్పడింది. ఈ కార్యక్రమంలో రామస్వామి, రియాజు, రాజు, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యతోనే ఉన్నత శిఖరాలు

## కేయూ ప్రొ. బైరి వెంకటరామిరెడ్డి



**వరంగల్ వాయిస్, శాయంపేట :** సమాజంలో పేదరికం, అసమానతలు లేని సమాజాన్ని నిర్మించాలంటే విద్యతోనే సాధ్యమవుతుందని కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ బైరి వెంకటరామిరెడ్డి అన్నారు. శుక్రవారం శాయంపేట మండలం పెద్దకోడపాక ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు మాలోతు సారయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదల, అంకితభావం, క్రమశిక్షణతో చదివి తాము ఎంచుకున్న లక్ష్యాలను సాధించాలని ప్రోత్సహించారు. అనంతరం ఆయన తన దాతృత్వాన్ని చాటుకుంటూ, దూర ప్రాంతాలైన కామారెడ్డిపల్లి, మైలారం, గోవిందపూర్, జోగంపల్లి నుంచి వస్తున్న పదిమంది విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, చదువుకున్న పాఠశాలల అభివృద్ధికి తమకు వీలైనంత సహాయం చేయాలని కోరారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీ నారాయణ, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు ప్రొఫెసర్ వెంకటరామిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# మైనారిటీ కాలేజీని పరిశీలించిన తహసీల్దార్



**వరంగల్ వాయిస్, వెంకటాపూర్ :** మండల కేంద్రంలోని మైనారిటీ గురుకుల బాలికల కళాశాలను మండల తహసీల్దార్ గిరిబాబు శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కళాశాల పరిసరాలను, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టికలను పరిశీలించారు. అలాగే, విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యతను కూడా పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం, శుభ్రమైన తాగునీరు అందించాలని సూచించారు. ముఖ్యంగా వర్షాకాలంలో విద్యార్థులు అనారోగ్యం పాలవకుండా ఉండేందుకు ముందు జాగ్రత్తగా వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించాలని కోరారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు మెరుగైన విద్య అందించడానికి నిరంతరం కృషి చేయాలని అన్నారు. కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్లను వెంటనే భర్తీ చేయాలని కూడా ఆయన పేర్కొన్నారు.తహసీల్దార్ వెంట ఆర్ఐ విజేందర్, కళాశాల ప్రిన్సిపాల్ వందన తదితరులు ఉన్నారు.

# సకల కళల పరిరక్షణ జేఏసీ జిల్లా కమిటీ ఎన్నిక

## జిల్లా అధ్యక్షుడిగా అక్బర్ పాషా



**వరంగల్ వాయిస్, పరకాల :** సకల కళల పరిరక్షణ జేఏసీ హనుమకొండ జిల్లా కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పరకాల పట్టణంలోని ఎఫ్.జే. గార్డెన్‌లో జరిగిన సమావేశంలో వివిధ మండలాల నుంచి వచ్చిన కళాకారులు పాల్గొని నూతన కమిటీని ఎన్నుకున్నారు. సకల కళల పరిరక్షణ జేఏసీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా మహమ్మద్ అక్బర్ పాషా, ప్రధాన కార్యదర్శిగా దండు సారంగపాణి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే, ఉపాధ్యక్షులుగా మల్లయ్య, బాబురావు, బుచ్చయ్య, సహాయ కార్యదర్శులుగా రమేష్, సమ్మయ్య, రాజయ్య, కోశాధికారిగా కొండ సమ్మయ్య, ప్రచార కార్యదర్శిగా బొందయ్య ఎన్నికయ్యారు. వీరితో పాటు తొమ్మిది మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహమ్మద్ అక్బర్ పాషా, దండు సారంగపాణి మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని ముఖ్యమంత్రిని కోరారు.

# బీసీ రిజర్వేషన్లు అడ్డుకుంటే బీజేపీపై ఉద్యమం

## ◆ జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరిక



**వరంగల్ వాయిస్, కేయూ:** బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటే కాకతీయ గడ్డ నుండే తెలంగాణ తరహాలో బీజేపీపై ఉద్యమం చేస్తామని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. శుక్రవారం కాకతీయ విశ్వవిద్యాలయంలో బీసీ మేధావులు ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సదస్సు ప్రారంభానికి ముందు దూరవిద్య కేంద్రం ప్రాంగణంలోని పూలే దంపతుల విగ్రహాలకు జాజుల శ్రీనివాస్ గౌడ్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 1931లో జరిగిన కులగణనతో బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ అవకాశాల్లో తీవ్ర నష్టం జరిగిందని అన్నారు. ఎన్నికలకు ముందు రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు కులగణన చేయాలని డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా ఎన్నికలకు వెళితే పుట్టగతులు ఉండవని ఏఐసీసీ కార్యాలయాన్ని ముట్టడించడంతో కాంగ్రెస్ దిగివచ్చిందని, శాసనసభలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిందని ఆయన గుర్తు చేశారు. అయితే, బీజేపీ మూడు నెలలుగా ఆమోదించకుండా అడ్డుకుంటోందని, రాష్ట్రంలో ధర్నా చేస్తామని మొండి వాదనలు చేస్తుందని ఎద్దేవా చేశారు. ఈడబ్ల్యూఎస్‌లో లేని ముస్లింల అంశాన్ని కేవలం బీసీ రిజర్వేషన్ల కోసం మాత్రమే బీజేపీ ఎందుకు తీసుకొస్తోందని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం పంపిన ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదం తెలపకపోవడానికి బీజేపీ అసమంజస వైఖరే కారణమని విమర్శించారు. అధికారంలో దశాబ్దం కాలం ఉండి స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లను 34 శాతం నుంచి 18 శాతానికి తగ్గించిన ఘనత కేసీఆర్‌ది కాదా అని ప్రశ్నిస్తూ బీఆర్ఎస్ తీరుపైనా జాజుల శ్రీనివాస్ గౌడ్ మండిపడ్డారు. బీసీల కులగణనలో పాల్గొనని కేసీఆర్ కుటుంబం మరోసారి బీసీలను నయవంచనకు గురి చేయడానికి బయలుదేరిందని, బీసీలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

సదస్సులో అధ్యక్షత వహించిన బీసీ యూనిటీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చెలమల్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాజ్యాంగంలో ఉన్న ప్రాతినిధ్య, ప్రజాస్వామ్య, సమానత్వం, సామాజిక న్యాయం కోసం విస్తృత చర్చలు అవసరమని, దీని కోసం రాష్ట్రవ్యాప్తంగా సమావేశాలు నిర్వహించి బీసీ భావజాల వ్యాప్తికి కార్యాచరణ రూపొందించామని తెలిపారు. పూలే ఆశయ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సంగని మల్లేశ్వర్ మాట్లాడుతూ బీసీలను ఓట్ల కోసం కాకుండా రాజ్యాధికారంలో భాగస్వాములను చేసేందుకు మూడు పార్టీలు కృషి చేయాలని హితవు పలికారు. ఈ సమావేశంలో కీలకమైన తీర్మానాలను ఆమోదించారు. బీసీల కోసం విద్య, ఉద్యోగం, రాజకీయ ప్రాతినిధ్య రంగాలలో 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకి నివేదించాలని నిర్ణయించారు. తెలంగాణ శాసనసభ ఆమోదించిన తీర్మానానికి త్వరగా ఆమోదం తెలపాలని, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేందుకు తమిళనాడు తరహాలో రాజ్యాంగ 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆచార్య వడ్డె రవీందర్, బైరి రవి కృష్ణ, డాక్టర్ చందా మల్లయ్య, డాక్టర్ తాడూరి శాస్త్రి, వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్, డాక్టర్ నల్లాని శ్రీనివాస్, డాక్టర్ తిరుణహరి శేషు, ఆచార్య విజయ బాబు, ఆచార్య కట్ల రాజేందర్, డాక్టర్ స్వర్ణలత, డాక్టర్ రాధికా రాణి తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీజే స్కూల్‌ను సందర్శించిన అడిషనల్ కలెక్టర్



**వరంగల్ వాయిస్, శాయంపేట:** మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ పాఠశాలను హనుమకొండ జిల్లా అడిషనల్ కలెక్టర్ వెంకట్ రెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని వసతులను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలోని భోజనశాల, వంటగది, స్టోర్ రూమ్, మరుగుదొడ్లు, తరగతి గదులు, వసతి గృహాలను అడిషనల్ కలెక్టర్ పరిశీలించారు. వసతుల నిర్వహణపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి, పాఠశాల కల్పిస్తున్న అన్ని సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని బాగా చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ప్రోత్సహించారు. విద్యార్థుల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పరకాల ఆర్డీఓ, శాయంపేట ఎమ్మార్వో, ఎంపీడీఓలతో పాటు పాఠశాల ప్రిన్సిపాల్ రేవతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# టీచర్స్‌కు 'ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టం' మంచి మార్పు

## సామాజిక వేత్త నిమ్మల శ్రీనివాస్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల హాజరు కోసం ప్రవేశపెట్టిన 'ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టం (ఎఫ్ఆర్ఎస్)' విద్యా వ్యవస్థలో మంచి మార్పునకు నాంది పలుకుతుందని ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ అన్నారు. ఈ కొత్త విధానం ఉపాధ్యాయుల హాజరు సక్రమంగా ఉండేలా చేస్తుందని, ఆలస్యంగా వచ్చే ఉపాధ్యాయులకు చెక్ పెట్టినట్లవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. జిల్లా కలెక్టర్లు ఎప్పటికప్పుడు హాజరును పర్యవేక్షించడం వల్ల ఉపాధ్యాయులలో జవాబుదారీతనం పెరుగుతుందని శ్రీనివాస్ పేర్కొన్నారు. ఇప్పటికే 80 శాతం మంది ఉపాధ్యాయులు తమ విధులను సక్రమంగా నిర్వహిస్తున్నారని, అయితే కావాలనే పాఠశాలలకు డుమ్మా కొట్టే ఉపాధ్యాయులు ఇకపై జాగ్రత్తగా ఉండాలని ఆయన హెచ్చరించారు. తప్పనిసరి కారణాల వల్ల విధులకు హాజరు కాలేని వారి పరిస్థితి వేరని ఆయన స్పష్టం చేశారు.

# పెద్దమ్మగడ్డ పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఏ. అప్పయ్య శుక్రవారం పెద్దమ్మగడ్డలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కేంద్రం పరిధిలో జరుగుతున్న వివిధ ఆరోగ్య కార్యక్రమాలను పరిశీలించారు. కార్యక్రమాల పురోగతిపై సమీక్షిస్తూ, డ్రై డే, ఏఎన్‌సీ నమోదు, ఎన్‌సీడీ రీ–స్క్రీనింగ్, ఫీవర్ సర్వేలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలని, అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి పనిచేయాలని సూచించారు. సిబ్బంది అందరూ సమయపాలన పాటించాలని స్పష్టం చేశారు. అలాగే, ఆయన ల్యాబ్, ఫార్మసీలను కూడా పరిశీలించారు. ఈ తనిఖీలో డీఎంహెచ్ఓతో పాటు డాక్టర్ సంజయ్, డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ మేనేజర్ రుక్మొద్దీన్, ఎన్‌యూహెచ్ఎం కన్సల్టెంట్ ఆర్.వినోద్ కుమార్, సిస్టర్‌లు, హెల్త్ అసిస్టెంట్, ఇతర పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

# మోరె రాజు ఎం.ఫిల్ సిద్ధాంత గ్రంథ పుస్తకావిష్కరణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం అధ్యాపకులు మోరె రాజు రాసిన ఎం.ఫిల్ సిద్ధాంత గ్రంథం "బీ.ఎస్. రాములు 'చూపు' నవల ఒక పరిశీలన" పుస్తకావిష్కరణ జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి. చక్రపాణి, అధ్యాపక, అధ్యాపకేతర బృందం ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. మోరె రాజు కృషిని కళాశాల బృందం, ప్రముఖులు ప్రశంసించారు. ఈ సిద్ధాంత గ్రంథం కాకతీయ విశ్వవిద్యాలయంలో సమర్పించడం గమనార్హం.

# పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** దేశాయిపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నిర్వహించిన 'ఫ్రైడే' కార్యక్రమానికి వరంగల్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా షుగర్, బీపీ వంటి నాన్–కమ్యూనికేబుల్ వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి ఉచితంగా మందులు పంపిణీ చేయాలని డాక్టర్ భరత్ కుమార్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో దేశాయిపేట పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి. భరత్ కుమార్, పబ్లిక్ హెల్త్ మేనేజర్ జన్ను కోర్నెల్, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వాగ్దానాల అమలులో నిర్లక్ష్యం


## ● వృత్తిదారుల సంఘం ఆరోపణ




**వరంగల్ వాయిస్, హైదరాబాద్:** ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమని తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్ యాదవ్ అన్నారు. శుక్రవారం డాక్టర్ రాజాబహదూర్ గౌర్ విజ్ఞాన కేంద్రంలో జరిగిన సంఘం విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ప్రసంగించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన వృత్తి సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి తాటిపాముల వెంకట్రాములు మాట్లాడుతూ నూతన జిల్లాలు ఏర్పడినప్పటికీ సహకార సంఘాలను విభజించకుండా, ఎన్నికలు జరపకుండా సహకార వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. దీనివల్ల వృత్తిదారులకు తీరని నష్టం జరుగుతోందని, తక్షణమే సహకార సంఘాలను విభజించి ఎన్నికలు జరపాలని డిమాండ్ చేశారు. పాడి పశువులు, గొర్రెలు, మేకలను అడవిలో మేపుకునేందుకు హక్కు కల్పించాలి. ప్రమాదవశాత్తు మరణించిన జీవాలకు నష్టపరిహారం ఇవ్వాలి. చదువుకున్న యువతీ యువకులకు పశుసంవర్ధక శాఖలో ఉద్యోగావకాశాలు కల్పించాలి. పాల ఉత్పత్తి అభివృద్ధికి మినీ పాల డైరీలకు 80 శాతం సబ్సిడీ ఇవ్వాలి. 50 ఏళ్లు దాటిన వృద్ధులకు రూ.5,000 పింఛను ఇవ్వాలి. ప్రమాదవశాత్తు మరణించిన గొర్రెల కాపరులకు రూ.20 లక్షల ప్రమాద బీమా కల్పించాలి. బీసీలకు స్థానిక సంస్థలు, విద్య, ఉద్యోగాల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లును పాస్ చేసి కేంద్రానికి పంపించినా, నెలలు గడిచినా ఆమోదించకుండా బీసీలకు కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేస్తోందని సంఘం నాయకులు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా బీసీలందరూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. తమ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 11న జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నా నిర్వహించి వినతిపత్రాలు ఇవ్వాలని రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్ యాదవ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లడంగి శ్రావణ్ కుమార్ యాదవ్, ఉపాధ్యక్షులు కటికిరెడ్డి బుచ్చన్న యాదవ్, సలహాదారు గుడిగె శ్రీనివాస్ యాదవ్, మత్స్య కార్మిక సంఘం అధ్యక్షుడు దిటి నరసయ్య, రజక వృత్తిదారుల సంఘం ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# కింగ్డమ్ పార్ట్ -2 పై అప్పుడే ప్రకటన


విజయ్ దేవరకొండ అభిమానులు కోరుకున్నట్టుగానే 'కింగ్డమ్' పార్ట్ 2 ఉంటుందని తేలిపోయింది. నాగవంశీయే ఈ విషయం చెప్పారు. కింగ్డమ్‌తో తో ఆయన విజయాన్ని అందుకోవడం ఆనందంగా ఉందని నిర్మాత సూర్యదేవర నాగవంశీ అన్నారు. విజయ్ ప్రస్తుతం చేస్తున్న సినిమాలు పూర్తవ్వగానే 'కింగ్డమ్ 2' మొదలవుతుందని, అందులో మరో అగ్ర హీరో కూడా ఉంటారని చెప్పారు. ఆయన ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంస్థతో కలిసి సితార ఎంటర్-టైన్‌మెంట్స్ పతాకంపై నిర్మించిన చిత్రమే 'కింగ్డమ్'. విజయ్ దేవరకొండ, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించారు. గౌతమ్ తిన్ననూరి దర్శకుడు. ఈ చిత్రం గురువారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. చిత్రానికి లభిస్తున్న స్పందనపై ఆనందం వ్యక్తం చేసారు. మేం ఊహించినట్టుగానే సినిమాకి మంచి స్పందన లభిస్తోంది. సాంకేతికంగా గొప్పగా ఉందనే ప్రశంసలు లభిస్తున్నాయి. ఒక తెలుగు సినిమాని హాలీవుడ్ స్థాయి సాంకేతికతతో తీశాం. థియేటర్‌కి వచ్చిన ప్రేక్షకులంతా తప్పకుండా సినిమాని ఆస్వాదిస్తారు. త్వరలోనే ఆంధ్రలో విజయోత్సవాన్ని నిర్వహిస్తాం' అన్నారు. 'కింగ్డమ్ 2'లో హీరోయిన్ పాత్రకి ప్రాధాన్యం ఉంటుందని, ఈ సినిమాలో పాట పెట్టేందుకు అవకాశం లభించలేదని ఆయన చెప్పారు. సినిమాలో కీలక పాత్ర పోషించిన నటుడు సత్యదేవ్ మాట్లాడుతూ విజయ్ గెలిస్తే నేను గెలిచినట్టే. ఏదైనా సాధించాలనే తపనతో సొంతంగా వచ్చే ఎంతోమందికి విజయ్ స్ఫూర్తి. ఇందులోని అన్నదమ్ముల బంధం గురించి, నటుల అభినయం గురించి అంతా మాట్లాడుతున్నారు. ఈ సినిమా ఇచ్చిన ఉత్సాహంతో మరిన్ని మంచి సినిమాల్ని అందించడానికి ప్రయత్నిస్తాం అన్నారు.






# రుద్రవీణను ఉపయోగిస్తున్న ఎఆర్ రహమాన్

రామాయణ మ్యూజిక్‌లో కొత్త ఒరవడి
బాలీవుడ్ నుంచి వస్తున్న ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టలలో 'రామాయణ'దాదాపు రూ.4000 కోట్ల బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌లో సాయిపల్లవి, బాలీవుడ్ నటు-డు రణ్‌బీర్ కపూర్, కన్నడ స్టార్ నటుడు యష్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమాకు దంగల్ సినిమా దర్శకుడు నితేశ్ తివారీ దర్శకత్వం వహిస్తుండగా.. నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్నాడు. రణ్‌బీర్ కపూర్ రాముడి పాత్రలో నటిస్తుండగా.. సాయి పల్లవి సీత పాత్రను పోషిస్తుంది. కన్నడ స్టార్ నటు-డు యష్ రావణుడి పాత్రలో నటించబోతున్నాడు. ఇక హనుమంతుడి పాత్రలో సన్నీ డియోల్, -కై-కేయి పాత్రలో లారా దత్తా నటిస్తుండగా.. లక్ష్మణుడి పాత్రలో రవి దూబే నటించబోతున్నాడు. రెండు పార్టులుగా ఈ సినిమా రాబోతుంది. అయితే ఈ సినిమాకు ఆస్కార్ దిగ్గజాలు, ప్రముఖ సంగీత దర్శకులు ఆ.. రెహమాన్, హన్స్ జిమ్మర్ కలిసి సంగీతం అందిస్తున్నారు. ఇదిలావుంటే తాజాగా ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి ఆసక్తికర విషయం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది.రామాయణం సినిమాలో బ్యాక్ గ్రౌండ్ స్కోర్ కోసం భారతీయ వాయిద్యాలలో పురాతనమైన రుద్ర వీణను రెహమాన్ ఉపయోగించబోతున్నట్లు- సమాచారం. దీనికి సంబంధించి ఇప్పటికే మ్యూజిక్ పనులు కూడా మొదలు పెట్టినట్లు- తెలుస్తుంది. కాగా దీనిపై అధికారిక ప్రకటన వెలుబడలేదు.



# చకచకా పెద్ది మూవీ షూటింగ్

కీలకమైన సన్నివేశాల చిత్రీకరణతో 'పెద్ది' సినిమా చకచకా ముందుకు సాగుతోంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ రామోజీ ఫిల్మ్‌సిటీలో జరుగుతోంది. అందులో భాగంగా రామ్‌చరణ్‌తోపాటు-, ఇతర తారాగణంపై ఓ వేడుక నేపథ్యంలో సాగే సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా కోసం ప్రత్యేకంగా సెట్‌ని తీర్చిదిద్దారు. ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగే పీరియాడిక్ చిత్రమిది. బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్నారు. రామ్‌చరణ్ సరసన జాన్వీకపూర్ నటిస్తున్నారు. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నాయి. ఈ చిత్రం కోసం శారీరకంగా ప్రత్యేకంగా సన్నద్ధమయ్యారు రామ్‌చరణ్. వచ్చే ఏడాది మార్చి 27న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రంలో కన్నడ నటు-డు శివరాజ్ కుమార్‌తోపాటు-, జగపతిబాబు, దివ్యేందు శర్మ తదితరులు నటిస్తున్నారు.





# మహావతార్ నరసింహకు జనం నీరాజనం

పౌరాణిక పాత్రలకు తిరుగులేదని మరోసారి నిరూపించింది 'మహావతార్ నరసింహ' అనే సినిమా. నిజానికి, ఈ సినిమాని హోంబాలే ప్రొడక్షన్స్ వాళ్ళు రిలీజ్ చేయడానికి ముందుకు వచ్చేవరకు అసలు ఈ సినిమా ఒకటి ఉందని కూడా ఆడియన్స్‌కి తెలియదు. హోంబాలే ఫ్యాన్ ఇండియా లెవెల్‌లో సినిమాని రిలీజ్ చేయడానికి రెడీ అవ్వడం, తెలుగులో గీత ఆర్ట్స్ డిస్ట్రిబ్యూషన్ చేయడంతో సినిమా మీద చర్చ జరిగింది. తర్వాత వచ్చిన ట్రైలర్ కూడా పెద్దగా ఆడియన్స్‌ని థియేటర్లకు రప్పించలేకపోయింది. కానీ, సినిమా చూసిన వారంతా సినిమా అద్భుతం అంటూ అబ్బురపడుతూ సోషల్ మీడియాలో మౌత్ టాక్ స్ప్రెడ్ చేయడంతో సినిమాకి ఇప్పుడు కలెక్షన్ల వర్షం కురుస్తోంది. తాజాగా, ఈ సినిమా ఇప్పటివరకు 53 కోట్ల రూపాయల కలెక్షన్లు రాబట్టినట్లుగా అధికారికంగా ప్రకటించింది సినిమా యూనిట్. ఇప్పటివరకు ఈ సినిమా 53 కోట్ల బాక్స్ ఆఫీస్ గ్రాస్ సాధించినట్లు- వెల్లడిరచారు. ఈ సినిమాని క్లీమ్ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద శిల్పా ధావన్ నిర్మించగా, అశ్విన్ దర్శకుడిగా వ్యవహరించారు.





# ఓరుగల్లులో క్రికెట్ స్టేడియం

- **అనువైన స్థలంకోసం ప్రతిపాదనలు కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ కు ఆదేశాలు**
- **ఈ నెలలోనే స్పోర్ట్స్ స్కూల్ కం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ప్రారంభం**


**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఓరుగల్లులో స్పోర్ట్స్ స్కూల్ కం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ, క్రికెట్ స్టేడియం ఏర్పాటుకు ముఖ్యమంత్రి రేవత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. శుక్రవారం జవహర్ లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్) లోని సదుపాయాలు, వసతులను పరిశీలించి స్పోర్ట్స్ స్కూల్ కం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీని తాత్కాలికంగా ఇక్కడే ప్రారంభించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. హనుమకొండలోని జేఎన్ఎస్ లో స్పోర్ట్స్ స్కూల్ కం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ తాత్కాలిక ప్రారంభానికి అవసరమైన సదుపాయాలను ఎమ్మెల్యే కడియం శ్రీహరి నేతృత్వంలో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ స్నేహ శభరీష్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయితో కలిసి క్షేత్ర స్థాయిలో పర్యటించి వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేడియం ఆవరణలో ఉన్న హాస్టల్ భావనాలు, ఇండోర్, అవుట్ డోర్ క్రీడా మైదానాలను పరిశీలించారు. చేపట్టాల్సిన మరమ్మత్తులు, కల్పించాల్సిన సదుపాయాలను అధికారులకు సూచించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యార్థులకు క్రీడా సదుపాయాలు ఏర్పాటు చేయాలని అందుకు అవసరమైన ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహృదయంతో, వరంగల్ జిల్లా ప్రజలపై ఉన్న ప్రేమతో క్రికెట్ స్టేడియం, స్పోర్ట్స్ స్కూల్ కం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ మంజూరు చేయాలని అడిగిన వెంటనే ఒప్పుకున్నారన్నారు. వెంటనే స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ తో త్వరితగతిన ఉమ్మడి వరంగల్ జిల్లాలో క్రికెట్ స్టేడియం, స్పోర్ట్స్ స్కూల్ కం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ఏర్పాటు చేయాలని, ఆగస్టు మాసం నుంచే స్పోర్ట్స్ స్కూల్ కం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ తాత్కాలిక ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. అదే విధంగా జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ కు క్రికెట్ స్టేడియం, స్పోర్ట్స్ స్కూల్ కం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారన్నారు. బీసీసీఐని సంప్రదించి క్రికెట్ స్టేడియం నిర్మాణానికి నిధులు, అలాగే స్పోర్ట్స్ స్కూల్ కం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని వెల్లడించారు. అందులో భాగంగానే జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో స్పోర్ట్స్ స్కూల్ కం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ తాత్కాలికంగా ప్రారంభించడానికి ప్రాథమికంగా నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. జేఎన్ఎస్ స్టేడియం ఆవరణలో విద్యార్థులకు హాస్టల్ వసతిలో ఉండాల్సిన సదుపాయల కల్పనకు, ఇండోర్, అవుట్ డోర్ క్రీడా సదుపాయాలు, పరికరాల ఏర్పాటుకు, అవసరమైన మరమ్మత్తులకు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చెయాలని స్పోర్ట్స్ అధికారులను ఆదేశించారు. ఆగస్టు నెలలోనే స్పోర్ట్స్ స్కూల్ కం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ప్రారంభించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, జిల్లా యువజన క్రీడాధికారి అశోక్, స్పోర్ట్స్ అథారిటీ, కూడా, మున్సిపల్ అధికారులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భూపాలపల్లికి బైపాస్ రోడ్డు

- **ఎంపీ డాక్టర్ కడియం కావ్య**
- **సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ**

**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని భూపాలపల్లి పట్టణానికి బైపాస్ రోడ్డు నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం పలు మార్లు కేంద్ర రోడ్లు, రవాణా మంత్రి నితిన్ గడ్కరీని కలసి కోరారు. భూపాలపల్లి పట్టణంలో ప్రధానంగా భారీ ట్రాఫిక్, బొగ్గు రవాణా, పవర్ ప్లాంట్ యాక్టివిటీల వల్ల ఎన్ హెచ్-353సి మీద తీవ్ర వాహన రద్దీ పెరగడంతో పట్టణమధ్యలో ప్రమాదాలు పెరిగిపోతున్నాయని ఎంపీ కేంద్ర మంత్రికి వివరించారు. గత మూడు సంవత్సరాల్లో 576 రోడ్డు ప్రమాదాలు జరగడంతో దాదాపు 233 మంది ప్రాణాలు కోల్పోయారని వివరించారు. ఈ పరిస్థితులను అధిగమించడానికి భూపాలపల్లి పట్టణాన్ని దాటి వెళ్లే ప్రత్యేక బైపాస్ రోడ్డు పనులను వెంటనే చేపట్టాలని కేంద్ర మంత్రిని ఎంపీ కడియం కావ్య కోరారు. రూ.250 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న బైపాస్ రోడ్డులో, రూ.175 కోట్లు నిర్మాణ పనులకు, రూ.75 కోట్లు భూసేకరణకు వినియోగించలని ఈ నిధులను 2025-26 వార్షిక ప్రణాళికలో చేర్చాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు స్పందించిన కేంద్ర రోడ్లు, రవాణా మంత్రి నితిన్ గడ్కరీ భూపాలపల్లి పట్టణానికి బైపాస్ రోడ్డు నిర్మాణానికి ఈ వార్షిక ప్రణాళికలో నిధులు మంజూరు చేస్తానంటూ హామీ ఇచ్చారు. అందుకు సంబంధించిన డీపీఆర్ ను తయారు చేసి టెండర్ పనులు పూర్తి చేస్తామని వివరణాత్మక లేఖ ద్వారా కేంద్ర మంత్రి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యకు తెలిపారు. బైపాస్ రోడ్డు నిర్మాణంతో ట్రాఫిక్ సమస్య, ప్రజల భద్రతో పాటు ప్రయాణదూరంలో లాభం కలుగుతుందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఇంటి వద్దకే ఉచిత వైద్య సేవలు




- **ప్రభుత్వం అందిస్తున్న 'ఈ-సంజీవని'తో అందుబాటు!**
- **హాస్పిటల్ కు వెళ్ళకుండానే వైద్య సేవలు**
- **ఉచిత కన్సల్టేషన్ తోపాటు, వాడవలసిన మందుల వివరాలు**
- **రాష్ట్ర వ్యాప్తంగా, దేశ వ్యాప్తంగా అందుబాటులో వేలాదిమంది వైద్యులు, స్పెషలిస్టులు**
- **వీడియో కాల్ సదుపాయం**
- **చికిత్స వివరాలు ఎప్పుడంటే అప్పుడు తెలుసుకునే వెసులుబాటు**

పల్లెలు, పట్టణాలు అన్న తేడా లేకుండా ఇప్పుడు అందరి చేతుల్లోనూ స్మార్ట్‌ఫోన్లు ఉంటున్నాయి. ఈ టెక్నాలజీని ఉపయోగించుకుని మన జీవితాలను మరింత సులభతరం చేసుకోవచ్చు. ముఖ్యంగా, ఆరోగ్య సంరక్షణ విషయంలో ఇది ఎంతో ఉపయోగపడుతుంది. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన 'ఈ-సంజీవని' (e-Sanje-evani) అనే అద్భుతమైన టెలిమెడిసిన్ ప్లాట్‌ఫాం, ఈ విషయంలో గ్రామీణ ప్రాంత ప్రజలకు ఒక వరం లాంటిది. డాక్టర్ దగ్గరకు వెళ్లడానికి దూర ప్రయాణాలు చేయాల్సిన అవసరం లేకుండా, ఇంట్లో నుంచే డాక్టర్‌ను సంప్రదించి, వైద్య సలహాలు పొందవచ్చు. ఈ సేవలను తెలంగాణలోని గ్రామీణ ప్రజలు ఎలా ఉపయోగించుకోవచ్చో ఇప్పుడు తెలుసుకుందాం.

## ఏమిటీ ఈ-సంజీవని?

'ఈ-సంజీవని' అనేది కేంద్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఒక ఉచిత టెలిమెడిసిన్ సేవ. ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న వేలాది మంది వైద్యులు, స్పెషలిస్టులు అందుబాటులో ఉంటారు. దీనిలో రెండు రకాల సేవలు ఉన్నాయి:

eSanjeevaniOPD: ఇది రోగి నేరుగా డాక్టర్‌తో వీడియో కన్సల్టేషన్ చేసుకునే సేవ. అంటే, మీ స్మార్ట్‌ఫోన్ లేదా కంప్యూటర్ ద్వారా డాక్టర్‌తో మాట్లాడవచ్చు.

eSanjeevaniAB-HWC: ఇది ఒక హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ (HWC)లో ఉన్న ఆరోగ్య కార్యకర్త సహాయంతో డాక్టర్‌ను సంప్రదించే పద్ధతి. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇది చాలా ఉపయోగపడుతుంది.

తెలంగాణలో ఈ సేవలు ఎలా ఉపయోగించుకోవాలి?

### 1.ఫోన్/కంప్యూటర్ ద్వారా:

ఈ-సంజీవని సేవలను ఉపయోగించుకోవడానికి మీకు ఒక స్మార్ట్‌ఫోన్, ఇంటర్నెట్ కనెక్షన్ మరియు ఒక మొబైల్ నంబర్ ఉంటే సరిపోతుంది.

**రిజిస్ట్రేషన్:** మొదట https://esanjeevani.mohfw.gov.in/ వెబ్‌సైట్‌లోకి వెళ్లండి లేదా 'eSanjeevaniOPD' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోండి. అక్కడ 'Patient Registration' పై క్లిక్ చేసి, మీ మొబైల్ నంబర్ ఎంటర్ చేయండి. మీ ఫోన్‌కు ఒక OTP (One Time Password) వస్తుంది. దానిని ఎంటర్ చేసి, మీ వివరాలు (పేరు, వయస్సు, లింగం) నమోదు చేయండి.

**కన్సల్టేషన్:** రిజిస్ట్రేషన్ పూర్తయ్యాక, మీకు ఒక Patient ID, Token నంబర్ SMS ద్వారా వస్తుంది. ఆ తర్వాత, డాక్టర్‌తో మాట్లాడటానికి 'Consult Now' బటన్‌ను నొక్కండి. మీ వంతు వచ్చినప్పుడు, డాక్టర్ వీడియో కాల్ ద్వారా మిమ్మల్ని సంప్రదిస్తారు.

**ప్రిస్క్రిప్షన్:** కన్సల్టేషన్ పూర్తయిన తర్వాత, డాక్టర్ మీకు డిజిటల్ ప్రిస్క్రిప్షన్ ఇస్తారు. దానిని మీరు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

### 2. ఆరోగ్య కార్యకర్త సహాయంతో (HWC కేంద్రాల ద్వారా):

స్మార్ట్‌ఫోన్ లేదా ఇంటర్నెట్ వాడకం తెలియనివారు, లేదా ఇంటర్నెట్ కనెక్టివిటీ లేని ప్రాంతాల ప్రజలు తమ గ్రామాల్లోని ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లకు (HWC) వెళ్లవచ్చు. అక్కడ ఉన్న ఆరోగ్య కార్యకర్త (Multi-Purpose Health Worker) మీ వివరాలను ఈ-సంజీవని ప్లాట్‌ఫాంలో నమోదు చేసి, డాక్టర్‌తో మాట్లాడేందుకు సహాయపడతారు. డాక్టర్ వీడియో కాల్ ద్వారా మిమ్మల్ని పరీక్షించి, అవసరమైన సలహాలు ఇస్తారు. డాక్టర్ ప్రిస్క్రిప్షన్‌ను ఆ కార్యకర్త ప్రింట్ తీసి మీకు అందిస్తారు.

### ఈ-సంజీవని వల్ల లాభాలు:

- ★ **ఉచిత వైద్య సలహాలు:** ఈ సేవ పూర్తిగా ఉచితం, కాబట్టి ఎలాంటి డబ్బులు ఖర్చు చేయాల్సిన అవసరం లేదు.
- ★ **సమయం మరియు డబ్బు ఆదా:** డాక్టర్ దగ్గరకు వెళ్లడానికి ప్రయాణ ఖర్చు, సమయం ఆదా అవుతుంది.
- ★ **స్పెషలిస్టుల సేవలు:** గ్రామీణ ప్రాంత ప్రజలు కూడా పట్టణాల్లోని స్పెషలిస్ట్ డాక్టర్ల సేవలను పొందవచ్చు.
- ★ **ఎలక్ట్రానిక్ రికార్డులు:** మీ ఆరోగ్య రికార్డులు, ప్రిస్క్రిప్షన్లు అన్నీ డిజిటల్‌గా సేవ్ అవుతాయి. భవిష్యత్తులో కూడా వాటిని సులభంగా యాక్సెస్ చేసుకోవచ్చు.

'ఈ-సంజీవని' లాంటి డిజిటల్ హెల్త్ ప్లాట్‌ఫామ్‌లు గ్రామీణ ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలను అందిస్తాయి. సాంకేతికతను సరిగ్గా ఉపయోగించుకోవడం ద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండగలరు. ఈ సేవలను సద్వినియోగం చేసుకోండి, ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడంలో పాలుపంచుకోండి.



**విజయ్ శ్రీరాములు**
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE. EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com